


# ఎవరు దొంగ?

## సి. ఆనందారామం

(ఆంధ్రజ్యోతి దీపావళి వార్షిక, 1975, నవంబర్)

**ముత్యాలు వణికిపోతూ నిల్చుంది**. దాని ఒళ్ళో బియ్యం. ఒకే ఒక కిలో బియ్యం, చుట్టూ యమదూతల్లా నిలబడ్డారు. ఆఫీసర్‌గారి భార్య రాజ్యలక్ష్మమ్మ. ఆఫీసర్‌గారి కూతుళ్ళు శాంత, రాధ. కొంచెం దూరంగా కుర్చీలో యమధర్మరాజులా కూచుని ముత్యాలును చీదరగా చూస్తున్నాడు ఆఫీసర్.



అలాంటి పరిస్థితిలో వళ్ళో ఉన్న బియ్యాన్ని వదలలేకపోతోంది ముత్యాలు. అవును. ఎలా వదలగలదు? తన కొడుకు కొడుకు, తన చిట్టి మనవడు రెండురోజులు ఉండిపోవటానికి వచ్చాడు. వాడికి అన్నం పెట్టడానికి ఇంట్లో బియ్యం లేవు. రాకరాక వచ్చినవాణ్ణి ఎలా పస్తు పడుకోబెట్టగలదు?

మధ్యాహ్నం అమ్మగారు తనకి పెట్టిన అన్నాన్ని మనవడికి తీసుకుపోవటానికి విశ్వప్రయత్నం చేసింది.

"అమ్మగోరు!ఇయాలొక్కసారికి ఇంటికెల్లొస్తానండీ" అని బ్రతిమాలింది.

అమ్మగారు మండిపడుతూ "దొరక్క దొరక్క ఈరోజే దొరికింది నీకు నాగా పెట్టడానికి? ఇవాళ చుట్టాలొస్తున్నారు. వెళ్ళడానికి వీల్లేదు" అంది.

ముత్యాలుకి తెలుసు. తను నాగా పెట్టడానికి ఎప్పుడూ వీల్లేదు. ఇవాళ చుట్టాలొస్తున్నారు. రేపు అమ్మగారికి వంట్లో బాగుండదు ఎల్లుండి అమ్మగారు ఎక్కడికో వెళ్ళాలి. నాగాలు పెట్టాలని దానికీ ఉండదు. పెడితే గడిచేదెట్లా? పనిలోకొస్తే చాయ్ దొరుకుతుంది. తన భోజనం గడిచిపోతుంది. బండ చాకిరీ ఉంటుంది .అయినా పరవాలేదు. దేవుడు తనకు రెక్కలిచ్చాడు. ఎంత చాకిరీ అయినా చెయ్యగలదు. ఎప్పుడూ నాగా పెట్టని తను అడుగుతున్నందుకైనా, ఒక్క రోజు కాస్త పంపించకూడదా?

"అమ్మగోరూ! నాగా పెట్టనండీ. యెంటనే యెల్లొస్తానండీ" బ్రతిమాలింది.

"పోవే! నీ యిల్లు దగ్గరుందా, వెంటనే వెళ్ళిరావడానికి? సాయంత్రం త్వరగా పని తెముల్చుకుని పో" కాస్త దయ చూపించింది రాజ్యలక్ష్మమ్మ.

స్పష్టంగా ఉన్న విషయం చెపితేనన్నా మనసు కరుగుతుందేమోనని, "అమ్మా! నా కొడుకు, కోడలు చూటానికొచ్చినారు. నా మనవడు కూడా వచ్చినాడు .చిన్న గుంటడు. ఆడికింత బువ్వ పెడదామని పోతానంటన్నా. ఈ అన్నం తీసుకుపోతా?" అంది దీనంగా.

ఆ మాటలకు మరింత చికాకు పడిపోయింది రాజ్యలక్ష్మమ్మ .

"ఇక్కడ తినమని అన్నం పెడితే ఇంటికి మోసుకుపోతానంటావు. ఏమీ తినకపోతే ఇంటెడు చాకిరీ ఎలా చెయ్యగలవు? తిను?"

కసురుకుని వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మమ్మ.

తను తినవలసిందే? తినక తప్పదు. తన మీద ప్రేమతో తనను తినమంటంలేదు. తను తినకపోతే ఇంటి చాకిరీ చేసేవాళ్ళు ఉండరని తినమంటున్నారు.

అన్నం ముందు కూచుంది. ఆఫీసర్‌గారింట్లో భోజనం ఎప్పుడూ బాగుంటుంది. ఆ వంటలన్నీ తను చేసినవే. తను వంట ఎంత బాగా చెయ్యగలదు. "బోడి మొకమా! ఈ యెదవ తిండి యెవడు తింటాడే" అని ప్రతి రోజూ కంచం ముందు విసుక్కునే మొగుడు ఒక్క రోజు ఈ తిండి తింటే బాగుండును. సరుకులన్నీ ఉంటే వంట ఎందుకు బాగుండదు?

ఈ పులుసు, ఈ కూర, ఈ హల్వా, ఇవన్నీ తన మనవడికి పెట్టగలిగితే..

"బామ్మోయ్" అంటూ కేరింతలు కొట్టే మనవడు కళ్ళముందు కదిలాడు. ముద్ద నోట పెట్టలేకపోయింది.

ముత్యాలు సరిగ్గా అన్నం తినలేకపోయిందని గమనించింది రాజ్యలక్ష్మి. ఆవిడ పని చేసుకోలేదు. పనిమనిషిని ఇంటికి పంపించదు. కానీ సహృదయురాలే.

"అదేం? అన్నం ఎందుకలా వదిలేసావ్? ఇంటికి పోవద్దన్నానని అలిగావా?" అంది.

ముత్యాలు ఒక్క నిట్టూర్పు వదిలి "మాకు అలకలేంటమ్మా. ఒళ్ళు బాగులేదు" అంది.

రాజ్యలక్ష్మమ్మ నిజంగానే నొచ్చుకుని "అయ్యయ్యో! కాస్త కాఫీ అయినా త్రాగు" అంది.

"వద్దులేమ్మా" అంటున్నా వినకుండా అప్పటికప్పుడు ముత్యాలు కాఫీ కలుపుకుని తాగేలా చేసింది.

"ఈ అమ్మ ఇంతే. తినబెడుతుంది. కానీ పని మాత్రం మాననియ్యదు" అనుకుంది ముత్యాలు.

అప్పుడప్పుడు ముత్యాలుకే విసుగుపుట్టి పని మానెయ్యాలనుకునేది. కానీ పెద్ద ఆఫీసర్‌గారిల్లు, యాభై రూపాయలు జీతం. తిండి – ఇలాంటి ఇల్లు మళ్ళీ తనకు దొరకదు. పని ఉంటుంది. పనిలేకుండా తిండి దొరుకుతుందా? గంపెడు సంతానం. అందర్నీ సాకాలి. పెద్ద కొడుక్కు పెళ్ళయింది. ఏదో ఉద్యోగమూ దొరికింది. అయినా వాడిది వాడికే సరిపోతుంది. ఎప్పుడో కాస్తో కూస్తో పంపుతాడు. ఇప్పుడు రాకరాక మనవడొస్తే కళ్ళల్లో నీళ్ళు తిరిగితే మాసిన పైట కొంగుతో తుడుచుకుంది ముత్యాలు.

ఆ మరునాడు ఇంటికెవరో వస్తే హాల్లో కూచుని మాట్లాడుతోంది రాజ్యలక్ష్మమ్మ. రాధ, శాంత ఆడపిల్లలన్నమాటేగాని యేదీ కల్పించుకోరు. కంటికెదురుగా డబ్బానిండా బియ్యం కనిపిస్తున్నాయి. ఇంట్లో బియ్యం నిండుకున్నయి. జీతమంతా అమ్మగారి దగ్గిర ఎప్పుడో అడ్వాన్స్‌గా తీసుకుంది. కాసిని బియ్యం తీసుకుపోతేనేం? కొడుక్కీ, కోడలికీ, మనవడికీ ఒక్క రోజైనా సుఖంగా భోజనం పెట్టచ్చు.

గబగబ కిలో బియ్యం తీసి కొంగులో చుట్టిబొడ్లో దోపుకుంది. ఎత్తుగా కనబడకుండా సమంగా సర్దుకుంది. అయినా యేదో కంగారు, గాభరా.

"ఎల్తున్నానమ్మగోరూ" అని వెళ్ళబోయింది.

పరాగ్గా "వెళ్ళు" అన్న రాజ్యలక్ష్మమ్మ దాని కంగారు, గాబరా ప్రత్యేకించి కడుపును తడుముతున్న దాని చేతులూ గమనించి "ఇలారా" అంది అనుమానంగా.

మరింత కంగారుపడిపోతూ "ఎల్తానమ్మగోరు ఇంటికాడ పనుంది" అని గబగబా వెళ్ళబోయింది. అక్కడితో రాజ్యలక్ష్మికి మరింత అనుమానం తోచి రెండంగల్లో దాని ముందుకొచ్చి భుజం పట్టి ఆపి "ఏదీ, నీ కొంగు చూపించు" అంది.

ముత్యాలు ముఖం పాలిపోయింది. ఒళ్ళంతా చెమటలు పట్టాయి. కాళ్ళూ చేతులూ వణికాయి. మాట్లాడలేక నిలబడింది. రాజ్యలక్ష్మి బలవంతాన దాని కొంగు లాగింది. బియ్యం బయటపడ్డాయి. రాజ్యలక్ష్మి తెల్లబోతూ "దొంగతనం చేసావా?" అంది .నోటమాట రాని ముత్యాలు ఏడుపులోకి దిగింది.

"ఛీ!ఛీ చేసింది చాలక ఇంకా యేడుస్తున్నావా? ఎప్పట్నించి ఈ దొంగతనాలు?"అంది రాజ్యలక్ష్మి గుండె బాదుకుంటూ.

"తల్లితోడు. ఇయ్యాలే తీసినా చంటాడి కోసం" ఏడుస్తూ మొత్తుకుంది ముత్యాలు. రాజ్యలక్ష్మికి నమ్మకం కలగలేదు.

"ఒట్లకేంలే ఎన్నైనా పెట్టగలరు మీరు. దొరక్కపోతే అందరూ దొరలే ఇవాళ చూశాను. ఎన్నాళ్ళనుంచీ సాగిస్తున్నావో? నమ్మి ఇల్లు వదిలితే ఇదా నువ్వు చేసే పని?"

"ఒట్టండీ. మీరు నా అన్నం పట్టుకెళ్ళనిస్తే కడుపు కట్టుకుని నా తిండి చంటాడికెడదామనుకున్నానండీ. మీరు వల్లకాదన్నారు."

"అందుకని దొంగతనం చేస్తావా? ఛీ!ఛీ! పనిచేసి అడిగి తీసుకెళ్ళాలిగాని..."

"అడిగితే నువ్విస్తావా మిగిలిపోయిన పాచిమెతుకులు పారేస్తావు కాని.." అనుకుందే కాని, ఏమీ అనలేకపోయింది ముత్యాలు.

గొడవకి రాధ, శాంత వచ్చారు. ముత్యాల్ని వింత మృగాన్ని చూసినట్లు చూశారు. ముత్యాలు తల క్రిందకు వాలిపోతోంది. ఆఫీసర్‌గారు కూడా వచ్చారు. విషయం వినగానే ఆయన ముఖం కోపంతో జేవురించింది.

ఏమిటీ దొంగతనమా? ముత్యాలు దొంగతనం చేసిందా?" అన్నాడు ముత్యాలును పురుగును చూసినట్లు చూస్తూ.

ఆ క్షణంలో తను చచ్చిపోయినా బాగుండుననిపించింది ముత్యాలుకి.

ఒళ్ళో దొంగతనం చేసిన బియ్యంతో ముత్యాలు. చుట్టూ న్యాయాధికారుల్లా ఆఫీసరుగారు, భార్యాపిల్లలు. "ముత్యాలుని మానిపించెయ్యి" తీర్పు చెప్పేసారు ఆఫీసర్. వణికిపోయింది ముత్యాలు.

"బాబుగోరూ నా కడుపు కొట్టకండి. ఇంకెప్పుడూ చెయ్యను" ప్రాధేయపడుతూ ఏడ్చింది ముత్యాలు.

"వీల్లేదు. నేను ఏదయినా సహిస్తాను కాని దొంగతనం సహించను. ఇంక నువ్విక్కడ పనిచెయ్యటానికి వీల్లేదు" కర్కశంగా అన్నాడు ఆఫీసర్.

పిడుగుపడినట్లే అయింది ముత్యాలు ప్రాణానికి.

"బాబుగారూ" అంటూ ఏడుపు ప్రారంభించింది.

రాజ్యలక్ష్మి కాస్త మెత్తబడింది పనిచేసుకోలేక.

"పోనీ, ఉండనియ్యండి" అంది.

"ఏవిటి మమ్మీ! నువ్వు మరీ మంచిదానివి. ఆ దొంగమనిషిని ఉండనియ్యమంటావేమిటి?" అని తల్లిమీద కసురుకున్నారు ముద్దుముద్దుగా రాధ, శాంతలు.

ఏడుస్తూ వెళ్ళిపోయింది ముత్యాలు.

ముత్యాలును మానిపించినంత తేలిగ్గా ముత్యాలులాంటి మరో మనిషి దొరకలేదు రాజ్యలక్ష్మికి. మరో మనిషిని పెడితే వంటలన్నీ తగలబెట్టింది. ఏమైనా అంటే విరుచుకుపడింది. చివరకు ఒళ్ళు మండి "నా జీతం నాకియ్యండి" అని రెండు రోజుల జీతం దెబ్బలాడి మరీ తీసుకుని మానేసింది.

రాధకీ, శాంతకీ కూడా ఇబ్బందిగానే ఉంది. ఇదివరకు వాళ్ళ బట్టలన్నీ పాపం, ముత్యాలే మడతలు పెట్టి బీరువాల్లో సర్దేది. ఇప్పుడు ఎక్కడ బట్టలక్కడే పడివుంటున్నాయి. బయటికెళ్దామంటే యేదీ కనపడదు. ఇల్లంతా చిందరవందరగా తయారయింది.

రాజ్యలక్ష్మి స్నేహితురాలు సుగుణ రాజ్యలక్ష్మిని చూడటానికి వచ్చింది.

ఆమాటా ఈ మాటా మాట్లాడుతూ "అబ్బ! వెధవ చాకిరితో చచ్చిపోతున్నాననుకో" అని కష్టం సుఖం చెప్పుకుంది రాజ్యలక్ష్మి.

"అదేం? మీ ముత్యాలు యేమయింది?"

"మానిపించేసా."

"ఎందుకు? ఎంతో బాగా పనిచేసేదికదూ! నెమ్మదస్తురాలు కూడా."

"ఆ! పని బాగానే చేసేది. కానీ దొంగతనాలు మరిగింది. అందుకే మానిపించా. దానిని తలుచుకోని రోజంటూ లేదు" విసుగ్గా అంది రాజ్యలక్ష్మి.

కొంచెం సేపు కూర్చుని మాట్లాడిన సుగుణ తిన్నగా ఇంటికి వెళ్ళకుండా ముత్యాలు ఇంటికి వెళ్ళింది. సుగుణని చూసి ముత్యాలు కంగారు పడుతూ "దండాలమ్మా? ఏంటి ఇట్టా వొచ్చారు?" అంది.

"నువ్వు రాజ్యలక్ష్మిగారి ఇంట్లో పని మానేసావా?"

"నేను మానెయ్యలేదండి. ఆళ్ళే మానిపించారు. చంటాడికి అన్నం తీసుకుపోతానంటే తీసుకుపోనియ్యలేదు. ఆడికోసం కాసిని బియ్యం కట్టుకున్నా. తప్పేననుకోండి. ఇంకెప్పుడూ చెయ్యనన్నా వొదల్లేదు, మానెయ్యమన్నారు. ఏం చెయ్యనండీ మానేసాను."

"మరెక్కడా కుదరలేదా?"

"సూత్తన్నానండి. అన్నీ చిన్న జీతాలు. కాస్తంత ఎక్కువ పనయినా, పెద్ద జీతానికి కుదరాలని సూత్తన్నాను. ఒళ్ళు దాసుకునే మనిసిని కాదండి."

"మా ఇంట్లో చేస్తావా? రాజ్యలక్ష్మమ్మగారు ఇచ్చినట్లే ఇస్తాను."

"అట్టాగేనండి" అని వెంటనే ఒప్పుకుంది ముత్యాలు. మరునాడే పనిలోకొచ్చేసింది.

సుగుణ భర్త వెంకట్రావు కొంచెం అసహనంగా "దొంగదని తెలిసే పనిలో పెట్టుకుంటున్నావా?"

సుగుణ నవ్వి "ఈ దొంగతనం కూడా మిగిలిన అన్ని గుణాల్లాగే మానవ ప్రకృతిలోనూ ఉందేమోనండీ. అవకాశం వస్తే దొంగలు కానివాళ్ళెవరు?" అంది.

"ఏయ్! నన్ను కూడా దొంగ అంటావా?"

"మొన్న ఆఫీసులో తెల్లకాగితాలు ఇంటికి తీసుకురాలా, పిల్లలకోసం?"

"ఛ! అదీ, ఇదీ ఒకటేనా?"

"ఆఫీస్ పనికోసమే ఉపయోగపడవలసిన కాగితాలు ఇంటికి తీసుకురావడం దొంగతనం కాదు?"

"ఏయ్ దొంగా! ఆ మాటకొస్తే నువ్వూ దొంగవే."

"నేనేం దొంగతనం చేశాను?"

"మీ ప్రిన్సిపాల్ కాలేజిలో లేకపోతే అరగంట ముందుగా వచ్చెయ్యలేదూ?

పకపకా నవ్వింది సుగుణ.

"అవును. నేనూ దొంగనే. అందరమూ దొంగలమే" అంది.

సుగుణ ఇంట్లో చేరినప్పనుండీ ముత్యాలుకి మరింత సుఖంగా ఉంది. సుగుణ ఉద్యోగస్తురాలు. ముత్యాలులాంటి మనిషి చాలా అవసరం. అంచేత అనునయంగా మాట్లాడుతుందేకాని కసురుకోదు. తన జాగ్రత్తలో తనుండి అన్నీ తాళాలు పెడుతుంది. అయినా అది ముత్యాలుకి కష్టమనిపించలేదు. ఎందుకంటే ఎప్పుడైనా తన వంతు అన్నం ఇంటికి పట్టుకుపోతానంటే నవ్వి "పట్టుకుపో" అనేది.

"చూడు నెలకొక రోజు నాగా నీకు సాంక్షన్. ఆ రోజు కూడా నాగా పెట్టకుండా వచ్చావంటే ఒక రోజు జీతం ఎక్కువిస్తాను" అనేది.

ముత్యాలుకి ఇది పరమానందంగా ఉంది. అసలెప్పుడూ నాగా పెట్టని మనిషి ముత్యాలు.

ఒక రోజు సుగుణ యేదో పిండివంట ముత్యాలుచేత రాజ్యలక్ష్మి ఇంటికి పంపింది. మొదట ముత్యాలు రాజ్యలక్ష్మి ఇంటికి పోవటానికి అభిమానపడింది.

కానీ సుగుణ "పరవాలేదు – వెళ్ళు" అనేసరికి బయలుదేరింది.

రాజ్యలక్ష్మి ముత్యాలును చూడగానే గంపంత ముఖంతో "మళ్ళీ పనిచెయ్యటానికి వచ్చావా? నాకు తెలుసు. మా ఇల్లులాంటి ఇల్లు నీకెక్కడ దొరుకుతుందీ? ఆ వెధవ దొంగబుద్ధి లేకపోతే నిన్ను మానిపించేదాన్నా? ఇంక మీదనైనా బుద్ధిగా ఉంటానంటే పనిలో పెట్టుకుంటాను" అంది.

ముత్యాలు మొదట తెల్లబోయి తరువాత నవ్వుతూ "నేను పని చెయ్యటానికి రాలేదమ్మా! సుగుణమ్మగారు మీకీ పలారం ఇచ్చి రమ్మంటే వచ్చాను. నేను సుగుణమ్మగారింట్లో కుదిరిపోయాను" అంది.

దిగాలు పడిపోయింది రాజ్యలక్ష్మి. ఒక్క క్షణం సుగుణ అదృష్టానికి ఈర్ష్యపడింది.

"మళ్ళీ మా యింటికి రావే. నాకు బాగా అలవాటుపడిపోయావు" అంది ప్రాధేయపడుతున్న ధోరణిలో.

ముత్యాలుకి నిజంగా జాలి కలిగింది.

"అమ్మగోరూ! పదిరోజులు ఖాళీగా పడి ఉండా? అప్పుడెప్పుడు పిలిసినా వచ్చేదాన్ని. ఇప్పుడెట్లాగమ్మా! సుగుణమ్మగారింటో కుదిరిపోయినా గందా" అంది.

"నేను నీకు మరో అయిదు ఎక్కువిస్తా నా దగ్గిరకు వచ్చెయ్యి" చటుక్కున అనేసింది రాజ్యలక్ష్మి.

ముత్యాలు "అమ్మగోరూ నాకు జీతం తక్కువనిపిస్తే ఆయమ్మనే అడుగుతా. అంతేగాని అర్ధంతరంగా ఎట్లా మానుకుంటానమ్మా" అనేసి వెళ్ళబోయి గుమ్మం దగ్గర ఆగి "పనేమైనా ఉందా అమ్మా! చేసిపోతాను" అంది.

రాజ్యలక్ష్మి వెంటనే యేవేవో పనులు పురమాయించింది.

అవన్నీ చేసి వెళ్ళబోతూ "పోతండానమ్మా చూసుకొండి. దొంగతనం చెయ్యలేదు" అని చీర దులిపి చూపించి తెల్లబోయి చూస్తున్న రాజ్యలక్ష్మిని పట్టించుకోకుండా వెళ్ళిపోయింది.

సుగుణతో జరిగిందంతా చెప్పింది ముత్యాలు.

సుగుణ హడిలిపోతూ "నీకు పుణ్యముంటుంది. నీకు కావాలంటే ఆ అయిదూ నేనే ఇస్తాను. నా దగ్గిర మానకు" అంది.

ముత్యాలు నవ్వుకుంటూ "దయగల తల్లులు మీరిస్తానంటే నేను కాదనను. కానీ అమ్మగోరూ ఆ అయిదు రూపాయల కోసం అబద్ధమాడానని మాత్రం అనుకోకండి" అంది.

"సుగుణ "గడుసుపిండం" అనుకుని నవ్వుకుంది.

రాజ్యలక్ష్మి భర్త ఆఫీసర్‌గారు లంచాలు తీసుకుంటున్నట్లు వర్తమానాలందాయి. అత్యవసర పరిస్థితి ప్రకటించిన తరువాత ఇలాటి అక్రమాలన్నీ సమూలంగా నాశనం చెయ్యాలనుకుంటున్నారు గనుక ట్రాప్ పన్ని అతని లంచగొండితనం నిరూపించారు. తప్పనిసరిగా రిటైర్ అవ్వాలని పై అధికారులు ఆదేశించారు.

ఈ వార్త అన్ని పత్రికలలోనూ వచ్చింది. ఆఫీసర్‌గారూ, అతని కుటుంబమూ ఆ ఊళ్ళో తలెత్తుకోలేకపోయారు. తమ స్వగ్రామం పోవాలని సంకల్పించుకున్నారు.

సుగుణ ముత్యాలుతో "రాజ్యలక్ష్మిగారు పాపం, ఈ ఊరు వదిలి వెళ్ళిపోతున్నారు" అని చెప్పింది.

"మళ్ళీ ఎప్పుడొస్తన్నారమ్మా" అమాయకంగా అడిగింది ముత్యాలు.

"ఇంక రారు. ఆయన్ని ఉద్యోగంలోంచి తీసేసారు."

"ఎట్టా? ఎందుకని?"

"లంచాలు తీసుకుంటున్నాడని."

"ఏంటి?"

అయోమయంగా అడుగుతున్న ముత్యాలుకి వివరించటానికని "దొంగపనులు చేస్తున్నాడని" అంది.

"అయ్యగారు దొంగపనా?"

బుగ్గన వేలేసుకుంది ముత్యాలు.

అన్నీ సర్దుకుని వెళ్ళబోతున్న రాజ్యలక్ష్మి ముత్యాలుని చూసి గతుక్కుమంది.

"ఎల్తన్నారని యిన్నాను అమ్మగోరూ. ఇన్నాళ్ళూ పనిచేసిన యిశ్వాసం కొద్దీ చూడాలని వచ్చినాను" బాధపడుతూ అంది ముత్యాలు.

ఒకనాడు గోలుగోలున యేడుస్తోన్న ముత్యాలుని 'దొంగ'వని ఇంట్లోంచి వెళ్ళగొట్టిన సంగతి గుర్తుకొచ్చింది రాజ్యలక్ష్మికి.

ఈనాడు – ఆలోచించలేకపోయింది. లేచి వెళ్ళి తన పాత చీర ఒకటి తెచ్చి ముత్యాలుకి ఇచ్చింది.

"ఎందుకమ్మగోరూ మీ సొమ్ము సాలానే తిన్నాను" అంది ముత్యాలు మొహమాటపడుతూ.

"పరవాలేదు తీసుకో నాకు కొంచెమైనా సంతృప్తి.." ఆప్యాయంగా అంటోన్న రాజ్యలక్ష్మి మాట కాదనలేక ఆ చీర తీసుకుని కళ్ళకద్దుకుంది ముత్యాలు.

మొహం వేలాడేసుకుని తల వంచుకుని ఇల్లు వదులుతున్న ఆఫీసర్‌గారిని చూడగానే "నేను ఏదయినా సహిస్తాను కాని దొంగతనాన్ని మాత్రం సహించను" అని సింహంలా గర్జించిన ఆఫీసర్‌గారి రూపం గుర్తుకొచ్చింది ముత్యాలుకి.

COMMENTS